క్లుప్తంగా

ఒమ్మెవరంలో ఇంటింటి సర్వే

సాక్షి ఎఫెక్ట్..

నాగులుప్పలపాడు: మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో పారిశుధ్య లోపం, వ్యాధులతో ప్రజలు అవస్థపడటంపై ఈ నెల 7వ తేదీ 'పారిశుధ్యం ఫట్..వ్యాధులు హిట్' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి బెన్‌హర్ బుధవారం గ్రామం మొత్తం బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి బావుల్లో క్లోరినేషన్ చేయించారు. పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కులదీప్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి వ్యాధుల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాల తీవ్రత తగ్గేంత వరకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని అధికారులు తెలిపారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి

సంతనూతలపాడు: సంతనూతలపాడు శాఖా గ్రంథాలయాన్ని 2023-24 సంవత్సరానికి సంబంధించి వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయం ద్వారా గ్రంథాలయం సెస్సు బకాయిలు వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు కే సత్యనారాయణ, గ్రంథాలయ ప్రతినిధి జె.బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంటను తనిఖీ చేసిన ఆర్డీఓ


ఈ-పంటను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ సుజన్‌కుమార్, అధికారులు

మద్దిపాడు: మండలంలోని పెదకొత్తపల్లి రెవెన్యూ పరిధిలో ఈ-పంట నమోదుపై ఆర్డీఓ లక్ష్మీప్రసన్న బుధవారం సూపర్ చెక్ నిర్వహించారు. పొలం ఎవరిది.. పంట సాగుచేస్తున్న కౌలు రైతు ఎవరనే విషయాలు తెలుసుకుని పంటను సక్రమంగా ఈ-పంట యాప్‌లో నమోదు చేశారా.. లేదా..? అనే విషయాలను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ సుజన్ కుమార్, ఆర్ఐ రమణయ్య, వీఆర్ఓ ఆరిఫా, ఏఈఓ శేషయ్య, సర్వేయర్ ఎబినైజర్, పెదకొత్తపల్లి రైతులు పాల్గొన్నారు.

ముగిసిన పొగాకు కొనుగోళ్లు

చీమకుర్తి: ఒంగోలు-1 పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు బుధవారంతో ముగిసినట్లు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ తెలిపారు. కొనుగోళ్లు పూర్తయిన సందర్భంగా వేలం కేంద్రంలో రైతులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పొగాకు బోర్డు అధికారులు పాల్గొనగా, కృష్ణశ్రీ మాట్లాడుతూ కేంద్రంలో ఈ ఏడాది 18.70 మిలియన్ కేజీల పొగాకు అమ్మకాలు జరిగాయన్నారు. రూ.278.19 సరాసరి ధరతో ఒంగోలు-1లో రూ.507 కోట్ల విలువైన పొగాకు విక్రయాలు జరిగినట్లు తెలిపారు. వేలంలో మొత్తం రైతులు 3,069 మంది పాల్గొన్నారని, వారి ద్వారా 10.04 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లకు అనుమతివ్వగా రికార్డు స్థాయిలో 18.70 మిలియన్ కేజీల పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రొడక్షన్ మేనేజర్ దామోదర్, బోర్డు మెంబర్ పీ వరప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

నాగులుప్పలపాడు: డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ టి.వసుంధర అన్నారు. బుధవారం మండల వెలుగు కార్యాలయంలో వీఓఏలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పీడీ పాల్గొని మాట్లాడారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు తీసుకునే లోన్‌లను వ్యక్తిగత అవసరాలకు కాకుండా చిన్న వ్యాపారాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డినేటర్ విజయమ్మ, ఏపీయం నరేంద్ర, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, సీసీలు పాల్గొన్నారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడి

మద్దిపాడు: రైతులు మేలైన విత్తనాలను ఎంచుకుంటే పంట దిగుబడి పెరుగుతుందని ఏఓ రమేష్ అన్నారు. బుధవారం మండలంలోని వెల్లంపల్లి, మద్దిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఏఈఓ పి.శేషయ్య, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

చెత్త పర్యవేక్షణ..!


తుప్పు పడుతున్న మిషనరీ


తలుపులు తెరుచుకోని రాజుపాలెం కేంద్రం

- చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై పర్యవేక్షణ శూన్యం
- కొత్తపట్నం మండలంలోని కేంద్రాలన్నీ నిరుపయోగం
- తుప్పు పడుతున్న మిషన్లు
- నిర్లక్ష్యంగా అధికారులు, పాలకులు
- లక్షల రూపాయల ప్రజాధనం వృథా
- గ్రామాల్లో మందగించిన పారిశుధ్యం


నిరుపయోగంగా మారి పిచ్చిచెట్లతో నిండిపోయిన అల్లూరు కేంద్రం

కొత్తపట్నం: అధికారులు, పాలకుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా కొత్తపట్నం మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్నీ నిరుపయోగంగా మారాయి. ఆయా కేంద్రాలన్నీ పనిచేయకపోవడంతో వాటిలోని మిషనరీ సైతం తుప్పు పట్టి పనికిరాకుండా పోతోంది. లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతున్నప్పటికీ అధికారులు, పాలకులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంపై ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కేంద్రాల నిరుపయోగంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు కూడా సక్రమంగా జరగపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీల్లో సేకరించిన చెత్త మొత్తాన్ని ఒకేచోటకు తరలించి ఆ చెత్త నుంచి సంపద తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తయారు చేసిన సంపదను విక్రయించి ఆదాయం రాబట్టాలని సర్వం సిద్ధం చేసింది. గ్రామాల్లో పొడి చెత్త, తడి చెత్తను విడివిడిగా కేంద్రాలకు తీసుకొచ్చి వేరువేరు తొట్లలో వేసి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా కొంతమందికి ఉపాధి కూడా కల్పించే విధంగా ప్రణాళికలు రూపొందించింది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కొత్తపట్నం మండలంలోని 15 పంచాయతీలకుగాను 12 పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి చేసింది. ఒక్కో కేంద్రానికి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు నిధులు కేటాయించి ఖర్చు చేసింది. తడి, పొడి చెత్తలను విడివిడిగా వేసుకునేందుకు ఒక్కో గృహానికి రెండు డస్ట్‌బిన్లను కూడా పంపిణీ చేశారు.

ఒక్క కేంద్రం కూడా ఉపయోగంలో లేని వైనం...

కొత్తపట్నం మండలంలోని ఆలూరు, మోటుమాల, గుండమాల, రంగాయపాలెం, కొత్తపట్నం, కె.పల్లెపాలెం, రాజుపాలెం, గమళ్లపాలెం, ఈతముక్కల, మడనూరు, సంకువారిగుంట పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో ఒక్క కేంద్రం కూడా ప్రస్తుతం ఉపయోగంలో లేదంటే.. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్తపట్నం, ఆలూరు పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలైతే పూర్తిగా శిథిలమయ్యాయి. కొన్ని కేంద్రాల్లో చిల్లచెట్లు పెరిగి అడవిలా తయారయ్యాయి. కొన్ని కేంద్రాల్లోకి వెళ్లాలంటేనే భయాందోళన చెందే పరిస్థితి నెలకొంది. అక్కడ విషసర్పాలు కూడా సంచరిస్తున్నాయి. అధికారులు ఆ ప్రాంతాలకు వెళ్లిన పాపాన పోకపోవడంతో ఆయా కేంద్రాలన్నీ పాడుబడిపోయాయి.

తుప్పుపడుతున్న రూ.లక్షల విలువ చేసే మిషన్లు...

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లోకి కేంద్ర ప్రభుత్వం రూ.లక్షల విలువ చేసే మిషనరీలు అందజేస్తూ వచ్చింది. ఒక్కో కేంద్రంలో సుమారు రూ.3 లక్షల వ్యయంతో మిషనరీలు ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. తొలివిడతగా కొత్తపట్నం మండలంలోని ఒక్క కేంద్రానికి మాత్రమే మిషనరీ కేటాయించారు. అది ఉపయోగకరంగా ఉంటే మిగతా కేంద్రాలకు కూడా మిషనరీ పంపించాలని భావించారు. మండలంలోని చెత్తను మిషనరీ దగ్గర డంపింగ్ చేసి క్రసింగ్ చేసి ఎరువు తయారు చేసి అమ్మకాలు జరపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, మిషనరీ తెచ్చారేగానీ.. అది నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. 2016లో కొనుగోలు చేయగా, ఇప్పటి వరకూ అసలు ప్రారంభమే కాలేదంటే ఆనాటి టీడీపీ ప్రభుత్వం, పాలకులు, అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలతో ఎన్నో ఉపయోగాలు...

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తెస్తే అనేక ఉపయోగాలతో పాటు లాభాలు కూడా మెండుగా ఉంటాయి. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, బాటిళ్ల వంటి వ్యర్థాలను పూర్తిగా తొలగించవచ్చు. వానపాములు తీసుకొచ్చి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేయవచ్చు. వాటిని విక్రయించడం ద్వారా గ్రామాలకు ఆదాయం వస్తుంది. ఒకవైపు చెత్త పూర్తిగా తొలగిపోయి గ్రామాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ఆ చెత్త ద్వారా తయారు చేసిన ఎరువు విక్రయించడం ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఆయా కేంద్రాల ద్వారా నలుగురికి ఉపాధి కూడా లభిస్తుంది. ఇన్ని ఉపయోగాలున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కొత్తపట్నం మండలంలో వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్త సంపద కేంద్రాలతో గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నంత కాలం గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయి. ప్రస్తుతం అవి ఉపయోగంలో లేకపోవడంతో గ్రామాలు కూడా కంపుకొడుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ చెత్త డంప్ చేయడం వలన వాటికి దగ్గరలో ఉన్న గృహాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమలు ప్రబలి వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. కేంద్రాలు ఉపయోగంలో ఉంటే ఇటువంటి పరిస్థితి ఉండదు. అందువలన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి.

– పిట్టు వెంకటేశ్వరరెడ్డి, వజ్జిరెడ్డిపాలెం

మిషనరీలను ఉపయోగంలోకి తీసుకురావాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎంతో విలువ చేసే మిషనరీలను ఉపయోగంలోకి తీసుకొస్తే ఆదాయం వస్తుంది. మిషనరీల వలన మండలంలో ఉన్న చెత్త, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లన్నీ క్రషింగ్ చేసి ఎరువులు తయారు చేయవచ్చు. వాటిని ఉపయోగించుకోకుండా ఆగష్టు 15, జనవరి 26 పోలీస్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమాల్లో మొక్కుబడిగా ప్రదర్శనలిచ్చి సరిపెట్టుకుంటున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకుని మిషనరీలు ఉపయోగంలోకి తీసుకురావాలి.

– పురిణి శివకృష్ణ, కొత్తపట్నం

ఆర్టీసీలో ప్రతిభ చూపిన ఉద్యోగులకు అభినందనలు

ఒంగోలు: స్థానిక ఆర్టీసీ డిపోలో సెప్టెంబర్ మాసానికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం అభినందించారు. ఆదాయ లక్ష్యానికి సంబంధించి కండక్టర్లు పి.హరిబాబు 101.29 శాతం, జి.నాగరాజు 98.14 శాతం, సీహెచ్ సుబ్బారావు 97.54 శాతం సాధించి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కిలోమీటరుకు అత్యధిక ఆదాయం సాధించిన వారిలో డ్రైవర్లు టి.శ్రీనివాసరావు (సూపర్ లగ్జరీ) రూ.42.98, వై.సాంబయ్య (అల్ట్రాడీలక్స్) రూ.45.65, పి.హనుమంతరావు (పల్లెవెలుగు) రూ.38.96, ఇంధన పొదుపునకు సంబంధించి ఎస్‌కే శ్రీనివాసులు 156 లీటర్లు ఆదా, పి.ఆంజనేయులు 121 లీటర్లు ఆదా చేశారని పేర్కొంటూ వారిని సత్కరించి ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఒంగోలు డిపో ట్రాఫిక్, మెకానికల్ అసిస్టెంట్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు

ఒంగోలు మెట్రో: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా ఒంగోలు కేశవస్వామిపేటలోని లలితాశ్రమంలో, కాశీవిశ్వేశ్వర దేవస్థానంలో బుధవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకుడు పొన్నూరు శ్రీనివాసులు మహిషాసురమర్దిని విశిష్టతను వివరించారు. అదేవిధంగా కేశవస్వామిపేటలోని లలితా పీఠంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు సిద్ధాంతి అగస్త్యరాజుశివ సరస్వతీదేవి గురించి వివరించారు.

ఫిష్ ఎమోనియం యాసిడ్‌తో ఉపయోగం

మడనూరు (కొత్తపట్నం): ప్రకృతి వ్యవసాయానికి ఫిష్ ఎమోనియం యాసిడ్ ద్రావణంతో ఎంతో ఉపయోగం ఉంటుందని యూనిట్ ఇన్‌చార్జి పిట్టు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని మడనూరు గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఫిష్ ఎమోనియం యాసిడ్ ద్రావణాన్ని తయారు చేసి చూపించారు. టీఎల్ వికాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం


పలకలు, పుస్తకాలు, పెన్నులతో సరస్వతీదేవి అలంకరణలో గొడుగుపాలెం కనకదుర్గాదేవి


ఒంగోలు : సరస్వతీదేవి అలంకరణలో కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి


ఉప్పుగుండూరు అయ్యప్పస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు


పలకలు, పుస్తకాలు, పెన్నులతో సరస్వతీదేవి అలంకరణలో లాయర్‌పేట సాయిబాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి


బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం


వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బాలబాలికలకు అక్షరాభ్యాసం


సరస్వతీదేవి అలంకరణలో బాలాజీరావుపేటలో కనకదుర్గాదేవి


కేశవస్వామిపేట విజయదుర్గాదేవి ఆలయంలో సరస్వతీదేవిగా..


ఒంగోలులోని ప్రసన్నచెన్నకేశవస్వామి ఆలయంలో మహాసరస్వతీదేవి


సంతపేట సాయిబాబా ఆలయంలో సరస్వతీ అమ్మవారి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం


సంతపేట సాయిబాబా ఆలయంలో సరస్వతీదేవి


సరస్వతీదేవి అలంకరణలో అచలానందాశ్రమంలోని గోవిందమాంబ


సంతనూతలపాడు త్రిపురాంతకస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా


కేశవస్వామిపేట కనకదుర్గాదేవి ఆలయంలో సరస్వతీదేవి పూజలో పాల్గొన్న భక్తులు


చీమకుర్తి హరిహరక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు


లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో షిరిడీసాయి దివ్యచరితం కూచిపూడి నృత్యరూపకం


అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు


అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

ఒంగోలు మెట్రో: దసరా పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో పూజలందుకున్నారు. ఒంగోలులో బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో, తదియారాధన సంఘం ఆధ్వర్యంలో, ఒంగోలు రంగారాయుడు చెరువు దగ్గర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో శుభప్రదం కమ్యూనిటీ భవనంలో విద్యార్థులచే సామూహిక కుంకుమ పూజలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. సంతపేట సాయిబాబా మందిర ప్రాంగణంలోని నాగలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఉన్న శ్రీ సరస్వతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 10 గంటలకు చిన్నపిల్లలకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ అళహరి చంచలరావు, భక్తులు పాల్గొన్నారు.

చీమకుర్తి హరిహరక్షేత్రంలో...

చీమకుర్తి: స్థానిక హరిహరక్షేత్రంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులు పూజలు నిర్వహించారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: స్థానిక త్రిపురాంతకస్వామి ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఎస్.బుజ్జిబాబుశర్మ, ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని ఆలయాల్లో బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉప్పుగుండూరు అయ్యప్పస్వామి ఆలయంలో వేద పండితుల ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

పంచాయతీల అభ్యున్నతికి నడుం బిగించండి

సంతనూతలపాడు: పంచాయతీల అభ్యున్నతికి వార్డు మెంబర్లు నడుం బిగించాలని సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఉప సర్పంచులు, వార్డు మెంబర్ల శిక్షణ తరగతులలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈవోఆర్డీ ఎం.రమణమ్మ అధ్యక్షత వహించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సమస్యలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వార్డు మెంబర్లు పరిష్కరించాలని ఎంపీడీవో సూచించారు. పంచాయతీ వనరులు, పనుల నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల ప్రక్రియ, తదితర అంశాలపై ఈవోఆర్డీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీఓ వాసంతి, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడులో...

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు బుధవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జల్‌జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుధీర్, జిల్లా కో-ఆర్డినేటర్ కేశవరావు, ఈవోఆర్డీ మురళీమోహన్, ఏవో దక్షిణామూర్తి, ఎంఆర్‌సీ షేక్ అంజయ్య తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

విద్యాసంస్థల్లో ఘనంగా దసరా వేడుకలు


క్విస్ కాలేజీలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు


శ్రీ సూర్య విద్యానికేతన్‌లో నవదుర్గల వేషధారణలో విద్యార్థులు

ఒంగోలు సిటీ: నగరంలోని పలు విద్యాసంస్థల్లో దసరా వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక క్విస్ విద్యాసంస్థలో దేవీశరన్నవరాత్రి వేడుకలు నిర్వహించగా, సుమారు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దుర్గామాత విగ్రహాల తయారీ, పెయింటింగ్, డ్రాయింగ్, మెహందీ కళ, ఖజానా హంట్, గీతాలు, నాట్యం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కాలేజీ కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.సూర్యకళ్యాణ్ చక్రవర్తి, చైర్మన్ వై.వి.హనుమంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కిషోర్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ సూర్య విద్యానికేతన్‌లో...

ఒంగోలు అన్నవరప్పాడు రెండో లైన్‌లోని శ్రీ సూర్య విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 3 నుంచి దసరా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రామాల వెంకటరామిరెడ్డి తెలిపారు. 8వ తరగతి విద్యార్థినులు దసరా వచ్చిందయ్యా అంటూ ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. దసరా నవరాత్రుల ప్రాముఖ్యతను తెలియజేస్తూ 8, 9, 10 తరగతుల విద్యార్థులు నవదుర్గల వేషధారణల్లో నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. మహిషాసురుడిని వధించిన ఘట్టాన్ని ఎంతో అద్భుతంగా అభినయించారు. ఉపాధ్యాయులు తొమ్మిది రకాల ప్రసాదాలు పంచిపెట్టారు. కరస్పాండెంట్ రామాల వెంకటరామిరెడ్డి దసరా ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీఎస్ఆర్ శాస్త్రి, కళాశాల ఇన్‌చార్జ్ శారదారాణి, వైస్ ప్రిన్సిపాల్ అనూరాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.